## పెద్దకథ



# అమ్మాయిలూ తొందరపడకండి!

ఓ చేతిలో ఏణ్ణర్ధం పావ, రెండో చేత్తో బరువయిన ప్లాస్టిక్‌బ్యాగు, భుజానికి నిండుగావున్న వ్యాండుబ్యాగుతో బస్సుకోసం ఎదురుచూస్తూ, అసహనంగా నిల్చుంది భారతి. ఎండాకాలం ఏమో ఉదయం ఎనిమిదిన్నరకే ఎండ చుర్రుమంటోంది. ఉక్క, చెమట, చీదరతో చేతిలో పావ చిరాగ్గా ఏడుస్తోంది. చేతిలో బరువు దానికి తోడు పావ ఏడుపు. రాని బస్సుకోసం ఎదురుచూపుతో నీరసం వస్తోంది భారతికి. పిల్లని నేలమీద కూలేసి కింద కూలబడాలన్నంత చిరాగ్గా వుంది ఆమెకి. ఏమున్నా ఏం లేకపోయినా మధ్యతరగతి మధ్య సంస్కారం వుంది కనక అంత పని చెయ్యలేక చేతిలో పిల్లవైపు గుర్రుగురుమిచూసి భయపెడ్తూ, గొణుక్కుంది.

"భారతీ,... నువ్వేనా... దూరంనుంచి చూసి నువ్వాకాదా అనుకున్నాను... యిదేమిటే యిలా అయిపోయావు?" గొంతువిని చటుక్కున తలతిప్పి చూసింది భారతి—సునయన!... పేరులాగే పెద్దకళ్లతో అందంగా వున్న సునయన. బి.ఏ.లో క్లాస్‌మేట్—'ఏమిటలా చూస్తున్నావు, గుర్తుపట్టలేదా?' సునయన నవ్వుతూ అంది. 'ఆ... ఆ... గుర్తెందుకువట్టను? హఠాత్తుగా కనిపిస్తే... ఏం చేస్తున్నావు? యీ వూర్లోనే వుంటున్నావా? పెళ్లయిందా? లేక వుద్యోగమా?' భారతి ప్రశ్నలు కురిపించింది. ఆరోగ్యంతో మిసమిసలాడుతూ, ఖరీదయిన బట్టల్లో అందంగా మెరిసిపోతున్న ఆమెని చూసి భారతి మనసు క్రుంగిపోయింది.

"పెళ్లయింది. మావారు యింజనీరు—క్రాంప్టన్ గ్రీవ్స్‌లో పని. పెద్ద కంపెనీకదా మంచి జీతం, యిల్లు, కారు అవన్నీయిచ్చారులే. నువ్వేమిటి యిలా వున్నావు... కళ్లల్లో ప్రాణాలు పెట్టుకుని యిలా నల్లగా పుల్లలా అయిపోయావేమిటి? మీ ఆయనేం చేస్తున్నారు, యీపావ నీపాపా... ఎన్నాళ్లయిందేమిటి పెళ్లయి?" సునయన కుతూహలంగా అడిగింది. భారతి ముఖం ముడుచుకుంది. జవాబు చెప్పడానికి తడబడింది. ఆమెని అవస్థనుంచి తప్పిస్తున్నట్లు బస్సువచ్చి ఆగింది—'సారీ సునయనా... ఈ బస్సుమిస్సయ్యానంటే మరో అరగంటవరకూ దొరకదు—బి.హెచ్.యి.ఎల్.స్కూల్లో పనిచేస్తున్నాను, యింకోసారి కలుద్దాం. మీ యిల్లెక్కడో చెప్పు" అంటూ గాభరాగా బస్సెక్కేసింది—సునయన యింటిగుర్తులు ఏవో చెప్పింది. అవి భారతి చెవికి ఎక్కనేలేదు. బస్సు కదిలింది—ఏదో ప్రమాదం తప్పినట్లు ఊపిరిపీల్చుకుంది భారతి.

ఎవరన్నా తెల్సినవారు కనిపిస్తే ఏదో తప్పుచేసినదానిలా తప్పించుకుని పారిపోవాలనిపిస్తుంది. ఛా... వెధవ బతుకయిపోయింది. అనుక్షణం తనను తాను నిందించుకుంటూ చావలేక బతికే బతుకు యిది. భారతికి ఉక్రోషంతో ఏడుపు వచ్చినట్లయింది. వినుగంతా చేతిలో గిజగిజలాడుతున్న పిల్లమీద చూపించి ఒక్కటేసింది. పిల్ల ఏడుపు లంకించుకుంది. ఏడుస్తున్న పావని చచ్చినట్లు సముదాయించాల్సి వచ్చింది. మొదటిబస్సుస్టాపులో దిగి రెండు సందులు నడిచి అక్కడ బేబికేర్ సెంటర్లో పావని, పావ సామానుని ఆయాచేతికిచ్చి మళ్లీ వచ్చి బస్సుస్టాపులో నిల్చుని బి.హెచ్.యి.ఎల్ వెళ్లే బస్సుకోసం ఎదురుచూడసాగింది భారతి.

జీవితంలో సగంభాగం యీ బస్సులకోసం ఎదురుచూడడం, ప్రయాణించడంతోటే సరిపోతోంది అనుకుంది. మళ్లీ సాయంత్రంవచ్చి బస్సుదిగి పావని పికప్‌చేసుకుని మళ్లీ బస్సెక్కి యిల్లుచేరి యిన్ని టీ నీళ్లు తాగి ట్యూషన్‌కి వచ్చిన పిల్లలకి ఏడున్నర వరకు పాఠాలు చెప్పి, ఉదయం ఐదుగంటలకి వండుకున్న చల్లని మేకుల్లాంటి అన్నం యింత వచ్చడీ చారు వేసుకుని తిని, వళ్లెరగకుండా నిద్రపోయి—మళ్లీ తెల్లవారి లేచి వంట ఆరంభించి, యిన్ని చపాతీలు చేసుకుని టిఫిను బాక్సులో పెట్టుకుని, పావకోసం పాలు, అన్నం, బిస్కట్లు వగైరాలు ప్లాస్టిక్ బ్యాగులో సర్ది పావ, తను స్నానం చేసి యిల్లు సర్దుకుని మళ్లీ పరిగెత్తి బస్సులు ఎక్కడం—యిదీ తన జీవితం! యిదా తను కలలుకన్న జీవితం! ఉదయం లేచింది మొదలు పొట్టకూటికోసం అరక్షణం విశ్రాంతిలేకుండా పరుగులెత్తే జీవితమా తను కోరుకున్నది! ఏ ప్రేమ కోసం తపించి తప్పటడుగు వేసిందో ఆ ప్రేమ, అనురాగం అన్నీ ఎండమావులు, దూరపుకొండలు అని అర్థం అయ్యేటప్పటికి, మెడకి గుదిబండలా ఓ పావ, ఆ పావకోసం జీవచ్ఛవంలా బతికే తను మిగిలారు! బతుకులో మమత, తీపి, కోరిక అన్నీ చచ్చిపోయినా ఏదో కసితో తనని తను శిక్షించుకోడానికన్నట్లు బతుకీడుస్తోంది. పాత జీవితాన్ని గుర్తుచేసే

ఏ మనుషులు కన్పించినా, ఏదన్నా సంఘటన జరిగినా ఆ రోజంతా భారతి మనసు వికలమయిపోతుంది. బండబారిన గుండెతో బతుకీడ్చే ఆ గుండెపై సమ్మెటపోట్లు తగుల్తాయి—అప్పుడప్పుడు పాత పరిచయస్థుల్ని చూసినప్పుడు.

సునయన... ఎంత అదృష్టవంతురాలు! చక్కటి భర్త, హోదా, అందం, ఆనందం, ఆరోగ్యం—ఐశ్వర్యం... అన్నింటినీ గుత్తకి తీసుకున్నట్లు ఎంత హాయిగా వుంది! ఆ హాయి, ఆ ఆనందం తనకి దక్కకుండా చేసుకున్నది తనేగా! కావల్సిందే ఈ శాస్తి తనకి! భారతికి ఉక్రోషం, ఆవేదనతో కన్నీళ్లు జారాయి. తనూ ఓ ఇంజనీరుకి భార్య అయివుండేదే! ఈనాటి సునయనలా తనూ అందంతో, ఆరోగ్యంతో, ఐశ్వర్యంతో మిసమిసలాడుతూ కారులో తిరిగేది! చేతులారా అన్నింటినీ దూరం చేసుకుంది తనేగా! యిప్పుడు తనెవరిని బ్లేమ్ చెయ్యగలదు! 'ఇడియట్... యూ డిజర్విట్' కసిగా తనని తాను మరోసారి తిట్టుకుంది!... హు... ప్రేమట! ప్రేమ!... యూ బ్లడీఫూల్... ప్రేమ!... లవ్!... అవన్నీ అందనంతవరకే అందంగా కన్పించి ఊరిస్తాయి... పెద్ద ప్రేమికులుగా చరిత్రలో చిరస్థాయిగా నిల్చిపోయిన రోమియోజూలియట్, దేవదాసు పార్వతి, సలీం అనార్కలి... వీళ్లందరి ప్రేమ సఫలంకాలేదు కనక అమర ప్రేమికులుగా నిల్చిపోయారు! అదే వీళ్లందరి ప్రేమా పెళ్లిగా మారితే అప్పుడు తెలిసేది వీళ్లంతా ఎంతటి అమరప్రేమికులో... అప్పుడు వీళ్ల ప్రేమలు, పేర్లు నామరూపాలు లేకుండా పోయేవి! ప్రేమ! షిట్... పీర్‌షిట్... ఈ ప్రేమల గురించి గొప్పగా రాసే రచయితలందరినీ షూట్‌చేసి పారేయాలి!... ప్రేమలు, త్యాగాలు చూపించి ఆడపిల్లల్ని వెర్రెక్కించేట్టు చేసే ఈ రచనలన్నీ తగలపెట్టాలి! ప్రేమ కథలుగా సినిమాలు తీసి ప్రేక్షకులని మోసం చేసి డబ్బు సంచులు నింపుకునే నిర్మాతలను క్షమించకూడదు! తెలిసీ తెలియని వయసులో పుస్తకా

## -డి.కామేశ్వరి

లు చదివి, సినిమాలు చూసి ప్రలోభంలో పడి, ఉచితానుచితాలు మర్చిపోయేట్టు మైమరపులో, భ్రమలో పడేసే ఈ రాతలన్నీ తగలబెట్టాలి! 'ప్రేమంటే దూరంగా వున్నప్పుడే దాని మజా. అందగానే అదీ అతి మామూలు అయిపోతుంది వెర్రి మొహాల్లారా... అంచేత ప్రేమ మెరుగులు ఎండమావులని తెల్సుకోండి. ఎండమావి ఊరిస్తుంది తప్ప దాహం తీర్చదు. పిచ్చి నాయనల్లారా, యీ పుస్తకాలు కావలిస్తే సరదాగా చదువుకోండి కాలక్షేపానికి, అంతేగాని ఆచరణలో పెట్టకండి' అని ఓ హెచ్చరిక ఏ రచయితలూ రాయరేం—సిగరెట్టు పెట్టె మీద సిగరెట్లు ఆరోగ్యానికి హానికరం అన్న హెచ్చరికలా యీ ప్రేమకథలూ మీ భవిష్యత్తుకి హానికరం అన్న కాషన్ చివర్న ఈ రచయితలు చేర్చరేం! ప్రేమ అన్నది అందమైన ఊహామాత్రమే—ఊహగా వున్నంతవరకే అందులో తీపి! అంతకంటే ప్రేమనుంచి ఏమీ ఆశించకండి! ఏ వెధవా ఏ త్యాగాలూ చెయ్యడు ప్రేమకోసం.. అమ్మాయిలూ జాగ్రత్త! ప్రేమని గురించి చదవండి. ఊహల్లో ఆనందించండి! కలల్లో తేలిపొండి!—కానీ ప్రేమలో పడకండి! పడినా, అది పెళ్లిదాకా రానీయకండి! రానిచ్చారా, బస్, ఆనాటితో మీ జీవితం అధోగతే అని నమ్మండి అని అరిచి అందరికీ చెప్పాలని వుంటుంది భారతికి! అలా అరవలేదు కనక, తెల్సిన ప్రతీ టీనేజ్ పిల్లకి, స్కూలు తెరిచి కొత్త సంవత్సరం, కొత్త క్లాసుతీసిన మొదటిరోజు మొదటిపాఠం ప్రేమగురించే చెప్తుంది భారతి!... తన జీవితం కథగా మలిచి—

"అమ్మాయిలూ మీరంతా వికసిస్తున్న మొగ్గలు. ఆ మొగ్గ రేకు విప్పి పరిమళాలు వెదజల్లకముందే నేలరాలిపోయే దుర్గతికి లోనుకాకండి. ప్రేమ అన్న పదమే ట్రాప్—నమ్మకండి, మోసపోకండి. ఆడపిల్లలూ మీ అక్కలాంటిదాన్ని... మీరు చదువుకోడానికి వచ్చారుగాని ప్రేమ పాఠాలు వినడానికి రాలేదని నాకు తెలుసు. బడిలో చదువుకునే పాఠాలు ఎలాగూ నేర్చుకుంటారు. జీవితంలో నేర్చుకోవాల్సిన పాఠం యిది. ఈ వయసులో ప్రతీది రంగులమయంగా అందంగా కన్పించి ఊరిస్తుంది. మధువు గ్రోలాలని ఆరాటంగా భ్రమరం దరిచేరితే, పువ్వు తన రంగులని మరింత అందంగా కన్పించేట్టుచేసి ఆకర్షించాలని తాపత్రయ పడ్తుంది తప్ప 'ఆ భ్రమరం మకరందంకోసం మాత్రమే తన దరిచేరుతుంది తరువాత వేరే పూవు దరి చేరుతుంది' అని గ్రహించలేదు అలా అమాయకపు విరిసీ విరియని ఆ లేత మొగ్గ భ్రమరాకర్షణకి లోనయిపోతుంది. అమ్మాయిలూ.... ఆ టీనేజ్‌లో 'ప్రతి అబ్బాయి తన అందానికి సమ్మోహితుడైపోయాడని, తనని మనసారా వాంఛించి ప్రేమిస్తున్నాడని, ఆ ప్రేమ, ఆ మధురానుభూతి తనకి మాత్రమే దక్కిన వరం' అని ప్రతి అమ్మాయి నమ్ముతుంది! ఆ ఆకర్షణకి లోనుగాకుండా నిగ్రహించుకోగల్గిన అమ్మాయిలు అదృష్టవంతులు! ఆ ఆకర్షణకి లోనయిన అమ్మాయి పతనానికి 'ఆనాడే పునాది పడ్తుంది' అని గ్రహించండి—మీ ప్రేమకి తల్లి తండ్రుల ఆశీర్వాదం వుండి, అది పెళ్లి వరకు దారితీస్తే కొంతలో కొంతనయం! పెళ్లితో ప్రేమ చచ్చినా ఆ వివాహబంధానికి కట్టుబడి నూటికి తొంభైమంది భార్యాభర్తల్లో ఏ స్పందనా లేకపోయినా బతుకీడ్చవచ్చు. ఏం జరిగినా యిటు అటు పెద్దవారు అండగావుంటారు. మీ ప్రేమకి పెద్దల అనుమతి లేకపోతే మాత్రం మూర్ఖంగా ఆ ప్రేమని నమ్ముకుని మోసపోకండి. ఆ ప్రేమ మిమ్మల్ని దరిచేర్చదు! నిశ్చయంగా నట్టేటముంచుతుంది. నూటికి ఏ ఒక్కరో ప్రేమకి కట్టుబడి నమ్మినదాన్ని అన్యాయం చేయని పుణ్యపురుషులు వుంటారు! అలాంటి పుణ్యపురుషుడ్ని వరించిన స్త్రీ నిజంగా అదృష్టవంతురాలే అవుతుంది! 'ఆ నూటికి ఒక్కరు మీరే' అని నమ్మకండి గుడ్డిగా. 'మీ మేలు కోరే పెద్దల మాట వినడం మీకు, మీ భవిష్యత్తుకు క్షేమం" అని మొదటి పాఠం ప్రతిసంవత్సరం రెండేళ్ళుగా ప్రతి క్లాసు ఆడపిల్లలకి చెపుతూంటుంది భారతి. ఆ పిల్లలకి ఎందుకుచెప్తుందో అర్థం అవదు! అర్థంకాలేదని గ్రహిస్తే భారతి అది తనకథ అని నిర్మొహమాటంగా చెప్తుంది—చేసిన తప్పుదాచుకోనని ఆమె నిజాయితీని నమ్మి భారతిటీచర్ అంటే పిల్లలు ప్రాణం పెడ్తారు ఆ స్కూల్లో! ఇన్ని తమకు చెప్పే ఆ టీచరు, యింత తెల్సిన ఆ టీచర్ ఎందుకిలా తప్పటడుగు వేసింది? అన్న సందేహం మాత్రం వదలదు పిల్లలని—దానికీ భారతి జవాబు రెడీగానే వుంటుంది—"నా అనుభవం నేర్పిన పాఠం యిది. ఆ అనుభవం మీకు కలగకూడదనేగా యిది చెప్తూంది. అంత లోతుగా ఆలోచించే విచక్షణ, పెద్దలు మంచికోసమే చేస్తారన్నది గుర్తించలేని వయసు తెచ్చిన ఆవేశం, తమ ప్రేమ అమర ప్రేమ అన్న గుడ్డినమ్మకం, ఏం జరిగినా ఎదుర్కొంటాను అనే మొండిధైర్యం, జీవితం అంటే ప్రేమ ఒక్కటేకాదు అని తెలియని అవివేకం, నే చూసినది, అనుభవించినది జీవితంలో పదోవంతు మాత్రమేనని యింకా తొంభై శాతం గురించి పెద్దలు ఆలోచించి చెప్తున్నారన్నది గ్రహించలేని మూర్ఖపు పట్టుదల... యివన్నీ అప్పుడు నా కళ్లు కప్పాయి. దిగాకగాని లోతు తెలియదు. దిగినతర్వాత ఆ లోతు దిగలాగుతుంటే బయటపడటం అతికష్టం. అందుచేత దిగేముందు లోతు చూసుకోవాలంటారు పెద్దలు. నే చెప్పే యీ మాటలు నా పెద్దలూ చెప్పారు. వయసుపొంగులో, ప్రేమ మైకంలో అవి పెడచెవినపెట్టిన ఫలితం ఈనాడు మీ ముందు నిల్చుంది. 'అమ్మాయిలూ తొందరపడకండి' అనిచెప్పే నా మాటలు మీలో పదిమందిలో నన్నా ఆలోచనరేపితే నా ధ్యేయం నెరవేరినట్టే" అని పాఠం చెపుతుంది—భారతి కన్పించిన ఆడపిల్లలందరికీ.

'ఇంత లోతుగా రెండేళ్లముందే ఆలోచించివుండి వుంటే' అనుకుంది భారతి ఆరాత్రి... 'భారతీ నీవు చిన్నపిల్లవి నీకింకా లోకజ్ఞానం లేదు, ఏదో ప్రేమ అనుకుంటున్నావు. యీ ప్రేమలు కూడపెట్టవు. నా మాటవినమ్మా' అని తల్లి నచ్చచెప్పింది, బతిమాలింది, ఏడ్చింది, తిట్టింది.

"ఏం చూసి అంత మోజుపడ్తున్నావు—వాడి బి.ఎ స్సీతో ఏం ఉద్యోగం వస్తుంది? ప్రేమ తిని ఇద్దరూ

> 'ప్రేమ గుడ్డిది' అన్నారు. 'చెవిటిది కూడా' అన్నారు మరికొందరు. జీవితంలో అసలు ఎవరినీ ప్రేమించకుండా వుండడం కంటే, ప్రేమించి తిరస్కారం పొందడంలో కొంత మాధుర్యం వుందన్న వారూ వున్నారు. కానీ "ఈ 'ప్రేమ' అనేది అంతా బూటకం" అంటున్నారు—మరొకరు! ఎవరా వనిత? ఆమె ఎందుకలా అనవలసి వచ్చింది?

ఎన్నాళ్ళు బ్రతుకుతారు? నువ్వు కొన్ని సౌకర్యాలకు అల వాటువడ్డావు. అవన్నీ లేకపోయేసరికి ఏ ప్రేమా అలాంటిచోట నిలవదు. నా మాట విను భారతీ, ఆ ఇంజనీరు అబ్బాయిని చేసుకో. నీ మంచి కోరేవాళ్లం, నీకంటే లోకానుభవం వున్నవాళ్లం. మామాట వినకపోతే నష్టపోయేది నువ్వే. కన్నవాళ్లం కనక యింతగా చెప్తు న్నాం—" చెప్పి చెప్పి విసిగిపోయిన తండ్రి కోపంగా అన్నారు.

"ఇద్దరూ ఉద్యోగాలు చేస్తారుట, వీళ్లిద్దరికి పిల్ని వేలకు వేలు యిస్తారు అనుకుంటుంది. ఈవిడ బి.ఏకి అతని బి.ఎస్సీకి అంతగా యిస్తే, చెరో వెయ్యి యిస్తారు గాబోలు. ఎంత చెప్పినా నీబుర్రకెక్కదేమిటే—ఆస్తి వుందా అంతస్తుందా దేనికోసం మోహించావు? మేం తెచ్చిన సంబంధం ముందు ఈ అబ్బాయి అతని కాలిగోటికి ఏ విషయంలోనూ సరిపోడు. నీ కళ్లకి ఏం పొరలు కమ్మాయే—" నచ్చచెప్పలేక తల్లి తలబాదు కుంది.

"ప్రేమ పొరలు కమ్మాయే దానికి, ఆ పొరలమధ్య నించి దానికి వాడు తప్ప యింకేం కనపడటం లేదు. ఆడుతూపాడుతూ పనిచేసుకుని కలోగంజో సినిమాల్లో మాదిరి తాగితే చాలనుకుంటుంది యీ వేడిలో. జీవితం సినిమాకాదని దానికి యిప్పుడు మనం చెప్పినా అర్థం కాదు. ఆ పొరలు విడిపోయాక అప్పుడు ఏడుస్తుంది లే—" కూతుర్ని వప్పించలేని నిస్సహాయత మధ్య కసిగా అన్నాడు తండ్రి. "ఆ వెధవని పోలీసులకి అప్పచెపుతాను. ప్రేమ గీమ వదలగొడ్తారు—చదువుకు రావే అని కాలేజీకి పంపితే, చేసుకొచ్చిన నిర్వాకం యిది. ఇవాళ్టి నుంచి ఇల్లుకదులు. కాళ్లు విరగ్గొడతాను. గదిలో పడేసి తాళం వేసి మూడు ముళ్లు వేయిస్తాను." తల్లి ఆఖరి అస్త్రం విడిచింది.

"అసలు పొరపాటు మనది. ఆడపిల్ల ముందు పుట్టిందని గారాబం చేశాం. యివ్వవలసిన దానికంటె ఎక్కువ స్వేచ్ఛయిచ్చాం—వుండు, వాళ్లింటికి వెళ్లి వాడికి, వాడి తండ్రికి అందరిముందు గడ్డిపెడ్తాను. అంత సులువుగా వదలను ఆ వెధవని. ఆడపిల్లలని వలలో వేసుకుని మాయమాటలు చెప్పి ప్రేమలు వల్లించి హీరో అనుకుంటున్నాడేమో—నలుగురు రౌడీ లనిపెట్టి తన్నిస్తాను-కాళ్లుచేతులు విరగ్గొట్టిస్తాను—" తండ్రి బెదిరింపు.

అప్పుడు తన మేలుకోరిన తల్లిదండ్రులు రాక్షసుల్లా కనిపించారు. కన్నకూతురి మనసు అర్థంచేసికోని, ప్రేమికుల బాధ అర్థంచేసుకోలేని వీళ్లు ఏం మనుషులు! ఛీ... ఛీ... యీ పెద్దవాళ్లకి ఎప్పుడు బుద్ధివస్తుంది—జనరేషన్ గాప్....... వాళ్ల ఆలోచనలు అంతకంటే ఎదగవు... అనుకుని మనసులో శపించుకుంది తల్లి తండ్రులని—కొంపదీసి నిజంగా వీళ్లు చంద్రని తన్నించరు గదా! వెళ్లి వాళ్ల వాళ్లతో కల్సి మంతనాలు జరిపి తమని విడదీయరుగదా—అనని నమ్మించి మౌనంచేసి ఎవరికో కట్టబెడితే తను నిజంగా చచ్చిపో తుందిగాని వాడితో కాపురం చెయ్యదు. చంద్రని జాగ్ర త్తగా వుండమనాలి పెళ్లి అయ్యేవరకు. ఎందుకన్నా మంచిది... పెళ్లి అయ్యే వరకు తమ ప్లాను వీళ్లకి తెలికుండా జాగ్రత్తపడాలి—'భారతీ ఎందుకన్నా మంచిది మీ వాళ్లని ఎదిరించి మాట్లాడకు—వాళ్లు అన్నవాటికి వప్పుకున్నట్టు నటించు. వాళ్లు చేసుకోమన్న అబ్బాయిని చేసుకోడానికి ఆఖరికి వప్పుకున్నట్టు, నీవు దారికి వచ్చావని వాళ్లని నమ్మించు—యివతల మన ప్లాను మనం వేసుకుందాం—మీ వాళ్లక్కడ నిర్ణ యించిన ముహూర్తానికి ముందే మనం సింహాచలం వెళ్లి, పెళ్లి చేసేసుకుని రోగం కుదురుద్దాం—మన ప్రేమ అషామాషీ కాదని నిరూపించాలి. ఈ నెల్లాళ్లు కాస్త జాగ్రత్తగా వాళ్లకి అనుమానం రాకుండా ప్రవ ర్తించు' అని చంద్ర యిచ్చిన సలహా తు.చ.తప్పకుండా పాటించింది.

పిచ్చి అమ్మ నాన్న... ఎంత సంబరపడిపోయా రు—కూతురు ఆఖరికి దారికి వచ్చిందని, మొండితనం మాని తమ మాటల్లో నిజం గుర్తించిందని సంతోషపడి పోయారు. ఆ సంతోషంలో యింకాస్త ఎక్కువ ఖరీదు పెట్టి పెళ్లి చీరలు కొనుక్కోమన్నారు. స్నేహితులందరికీ వేరే డిన్నరిచ్చుకోమన్నారు. శుభలేఖలు వేయించారు. తమ తాహతుని మించి ఘనంగా పెళ్లి ఏర్పాట్లు చేశారు. నిజంగా తనను దురదృష్టం వెంటాడుతూందని ఆనాడు గుర్తించలేక ఆ అదృష్టాన్ని ఆనందాన్ని కాలద న్నుకుంది... ఎంత మోసం చేసింది తలిదండ్రులని. ఎంత బాధకి, అవమానానికి, రంపపుకోతకి గురిచేసింది కన్నవాళ్లని. వాళ్ల శాపమే తగిలి తనీనాడు యిలా అనుభవిస్తోంది. తన మేలుకోరి, తనని సుఖంగా ఆనందంగా చూడాలన్న వాళ్ల తాపత్రయాన్ని నిర్ల క్ష్యంగా నవ్వుకొని, నిర్దయగా లోకానికి మొహం చూపలేన ట్టు చేసిన తనకి—యీనాటి ఈ శిక్ష సరి అయిందే! పెళ్లికి వారం వుందనగా స్నేహితులకి శుభలేఖలు పంచివస్తానని చెప్పి, చేయించిన నగలు బ్యాగులో పెట్టుకుని, పెళ్లి ఖర్చులకోసం వుంచిన డబ్బులో రెండు వేలు పట్టుకుని యిల్లుదాటింది!

ఆనాటితోనే తనకి సుఖద్వారాలు మూసుకుపోయి నరకద్వారాలు తెరవబడ్డాయి—అని గుర్తించలే క—మహా తెలివిగా తనెంత చలాకీగా తప్పించుకువ చ్చిందో టాక్సీలో వెడుతూ చంద్రకి చెప్పి నవ్వుకున్నారు. దేముడి సమక్షంలో భార్య భర్తలయి హొటలు రూములో రాత్రి ఆనందపు శిఖరాలు అందుకున్న వేళ తనేదో ఘనకార్యం సాధించినట్టు సంబరపడిపోయింది. 'హు... వాళ్లకేం తెలుసు, ఈ ప్రేమలో దొరికే దివ్యాను భూతి—పిచ్చివాళ్లు... వాళ్లు చూసేది ఎంత సేపు చదువు, ఉద్యోగంతప్ప రెండు హృదయాలు కలవాల న్నది వాళ్లకి అర్థంకాదు—' అనుకుంది. ఈ పాటికి తనకోసం ఆరాటపడ్తూ వెతుక్కుంటారని, పెళ్లి వారం వుందనగా పెళ్లి కూతురు మాయం అయితే వాళ్లెదుర్కో వలసిన అవమానం తలచ్చుకుని అరక్షణం బాధప డ్డా—నేచెపితే వినకపోతే నా తప్పా, నా ప్రేమని అర్థంచేసుకుని ఆశీర్వదిస్తే యిలా జరిగేదా? నా తప్పేంవుంది? వాళ్లకి ముందే చెప్పాను' అనుకుంది. మరే ఆలోచనలు మనసులో జొరపడకుండా రాత్రికి పగలుకి తేడా తెలియకుండా ఉప్పెనలా చుట్టు ముట్టిన చంద్ర ప్రేమలో ముంచితేల్చాడు. హు... అది ప్రేమా!... రబ్బిష్—జస్ట్ లస్ట్... నథింగ్ ఎల్స్—తనలాంటి

ప్రముఖుల జీవితాలలో వనితలు :

## "ఇంటిలోని పోరు"

'ఇల్లాలు లేని ఇల్లు భూతాలకు నిలయం' అని ఒక సామెత వుంటే, 'ఇల్లు ఇరకటం, ఆలు మర్కటం' అని మరో సామెత వుంది. దీన్నిబట్టి వ్యక్తుల గుణగణాలకు అనుగుణంగానే ఇలాంటి సామెతలు వాడకం లోకి వచ్చి వుంటాయని అనిపిస్తుంది. లేక పోతే, అబ్రహాం లింకన్ వంటి ప్రసిద్ధ వ్యక్తి జీవితంలో 'మేరీటాడ్' వంటి గంప గయ్యాళి ఎలాంటి కల్లోలాన్ని సృష్టించి వుంటుందో, ఈ ఉదాహరణను బట్టే వూహించవచ్చును.

ఒకసారి అబ్రహాం లింకన్ భార్యా సమేతంగా తన స్నేహితులతో కూర్చుని కాఫీ తాగుతున్నాడు. ఏదో మాటల సందర్భంలో ఒక విషయం గురించి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు లింకన్. అది అతని భార్య మేరీటాడ్‌కు నచ్చలేదట. వెంటనే తాగుతున్న వేడి కాఫీని అతని మొఖం మీదికి విసిరికొట్టింది. ఆ ఘటనకు మిత్రులందరూ దిగ్భ్రాంతి చెంది, అలా చూస్తూ వుంటే, లింకన్ మాత్రం మౌనంగా, చేతి రుమాలుతో మొఖం తుడుచుకుని, సంభాషణ కొనసాగించాడు. అడుగడుగునా అలాంటి సంఘటనలను లింకన్ ఎదుర్కో వలసి వచ్చేది. చివరకు మేరీటాడ్ పిచ్చిదై మరణించేవరకు అంటే 23 సంవత్సరాల పాటు ఆమెతో అలా ఓర్పుగా సహజీవనాన్ని కొనసాగించాడు అబ్రహాం లింకన్ !

—డి. ఎస్. నారాయణ, తుని

పూల్స్—మోహాన్ని ప్రేమ అనుకుంటారు!... ఆ తెలివి తక్కువతనానికి తను సరి అయిన మూల్యమే చెల్లించింది... అప్పటికి ఈ రెండేళ్లలో ఓ వందసార్లన్నా తనని తాను తిట్టుకున్నట్టే ఆ రాత్రి నిద్ర ముంచెత్తే వరకు తిట్టుకుంది భారతి. అన్ని బాధలనూ మరిపించే నిద్రాదేవత అఖరికి కరుణించేవరకూ గతం తల్చుకుంటూనే నిద్రలోకి జారింది.

• • •

"ఆంటీ... ఎలా వున్నారు? ఈమధ్య మీ భారతి మావూళ్లో బస్సుస్టాపులో కన్పించింది. మాట్లాడేలోపల బస్సువచ్చేసింది. అలా అయిపోయిందేమిటి? పుల్లలా, కళ్లలో ప్రాణాలు పెట్టుకుని వుంది. చంటిపిల్ల, ఆ ఉద్యోగంతో అలా అయిపోయిందా? వాళ్ల ఆయనేం చేస్తున్నారు? ఇది అంతకష్టపడి వుద్యోగం చేయకపోతే నేం? వాళ్ల ఆయన ఇంజనీరేమోకదా!"— సునయన పుట్టింటికి వచ్చి బజార్లో భారతి తల్లి కనిపిస్తే పలకరించింది. భానుమతి మొహం మ్లానమయింది. ఈ పిల్ల తెల్సి వేళాకోళంగా అడుగుతుందా లేక ఆరా తీయడానికి అడుగుతుందా, లేక అసలు విషయం తెలియదా? ఆవిడ సునయన వంక చూసి విషాదంగా నవ్వింది. 'దాని ఖర్మ అమ్మా అంతా, దాని రాత అలా తగలడితే యింకేం చేస్తుంది? దాని రంగంతా పోయింది. కట్టెపేడులా వంట్లో మాంసం లేనట్టు ఎండిపోయింది. రాతమ్మా రాత' ఆవిడ కళ్లల్లో నీరు తిరుగుతుండగా యింకేం చెప్పలేనిస్థితిలో వెళ్లి పోయింది. సునయనకు ఏమీ అర్థంకాక తెల్లబోయింది. యింటికెళ్లాక తల్లిని అడిగింది.

"అయ్యో నీకు తెలియదా ఆ భారతి సంగతి—అవును నువ్వు ఇండియాలో లేవుగా... ఆపిల్ల ఎంతకి తెగించిందో తెలుసా, తల్లిదండ్రులు నిక్షేపంలాంటి సంబంధం కుదిరిస్తే ఎవడినో ప్రేమించానని ఓ తలమాసినవాడితో యింట్లోంచి పారిపోయి పెళ్లి చేసుకుంది. పాపం యింకా పెళ్లి వారంరోజులుండగా కూతురు యీ పని చేసినందుకు ఎవరికీ మొహం చూపలేక ఆ తల్లీ తండ్రి కుమిలిపోయారు. తండ్రికయితే మైల్డ్ హార్ట్ ఎటాక్ వచ్చింది. కూతురు అలాచేసిందన్న బాధతో, కోపంతో 'యింక అది చచ్చినదానికిందే మాకు లెక్క' అనుకున్నారు వాళ్లు... తరువాత సంగతులు నాకంత బాగా తెలియవు కాని యిప్పుడా అమ్మాయి వాడితో కల్సివుండడంలేదట—ఓ పిల్ల పుట్టిందట, యిటు తల్లి తండ్రికి కాక అటు ప్రేమించినవాడికీ కాక ఆ పిల్లతో అష్టకష్టాలు పడుతూ ఏదో ఉద్యోగం చూసుకుని బతుకుతుందని విన్నాను. ఇలాంటివి డైరెక్టుగా ఎలా అడుగుతాం, ఈ నోట ఆ నోట విన్నవి తప్ప. అసలు సంగతి నాకు తెలియదు—" అందావిడ.

"అంటే వాడు భారతిని వదిలేసిపోయాడేమిటి? యిద్దరూ పెళ్లిచేసుకోలేదా? అయ్యోపాపం భారతి ఎంత స్మార్టుగా చలాకీగా వుండేది, యిలా అయిందా దానికి—" సునయన విచారంగా అంది.

"తల్లి తండ్రి పిల్లని కన్నారు గాని దాని రాతని కనలేదు—ఎంతో ముద్దుగా అన్నీ చెయ్యాలనుకున్నా దాని ఖర్మ అలావుంటే ఇంకోలా ఎందుకు జరుగుతుంది?"

సునయనకి భారతీగురించి తెలుసుకోవాలన్న ఆరాటం నిలవనీయలేదు. 'వాళ్లమ్మ గారిని అడిగివస్తాను' అంటూ, తల్లి 'బావుండదే' అంటున్నా వినకుండా భారతి యింటికి బయలుదేరింది.

"రా అమ్మా... ఆ రోజు బజార్లో నువ్వు భారతి సంగతి చెప్పగానే నా మనసు తల్లడిల్లిపోయింది. యింకేం మాట్లాడలేకపోయాను. దాని మాట విన్నా తల్చుకున్నా గుండెలు చెదిరిపోతాయి. దాని ఖర్మ... ఏనాడో పావం చేసింది—అనుభవిస్తూందీనాడు."

'ఆంటీ, యిలా ఎందుకయింది? ఎందుకిలా చేసింది భారతి? వాళ్లిద్దరు అసలు పెళ్లి చేసుకోలేదా, అతను దీన్ని వదిలేసి వెళ్లిపోయాడా ఆంటీ—' సునయన బాధగా అంది.

"ఏం చెప్పనమ్మా... యిలా ఎందుకయిందంటే... దాని ఖర్మ అనడం మినహా ఏం చెప్పను? ఆ త్రాష్టుడు దాని జీవితానికి నిప్పుపెట్టాడమ్మా—ప్రేమ కబుర్లు చెప్పి దీన్ని వలలో వేసుకుని నమ్మించి, దేముడిగుడిలో మూడుముళ్లు వేసి మోజు తీరేవరకు ఆరు నెలలు కాపురంచేసి, యింకోదాని మోజులో దీని ఖర్మానికి దీన్ని వదలి వెళ్లాడు. గుడిలో దేముడు సాక్ష్యం చెప్పడానికి రాలేదు అప్పుడు. ఇంత చదివి లోకజ్ఞానం లేని మూర్ఖురాలిలా ఓ రిజిష్టరు పెళ్లన్నా చేసుకున్నది కాదు. ఆరు నెలలు కాపురం చేసి ఐదునెలలు గర్భిణిగా వున్నదాన్ని వదిలి, తనదారి తను చూసుకున్నాడు. యిది తెచ్చిన నగలు, డబ్బు అయిపోగానే దాటుకున్నాడు దీన్ని నట్టేటముంచి."

"భారతి ఏం చేసింది మరి... ఇంటికి వచ్చేసిందా మళ్లీ...'

"అలా వచ్చినా బాగుండేది... ఎంత తిట్టినా,కొట్టినా మొహం చూడమని శపథాలు చేసినా కన్నవాళ్లం కనక కరిగి దానికి ఆశ్రయం యిచ్చేవాళ్లం. లేదమ్మా—ఆ దెబ్బతో దాని మనసు విరిగిపోయింది. దాని నమ్మకాలని, దాని ప్రేమని నేల రాసి వాడు వెళ్లాక ఆ అవమానంతో తనింక మొహం చూపిస్తే అందరూ హేళన చేస్తారనిగాబోలు—నేచేసిన తప్పుకి శిక్షనేనే అనుభవించాలి...' నా తొందరపాటుకి ఈ శాస్తి సరిఅయిందే అంటూ తనని తను శిక్షించుకోడానికి అది ఎన్ని యిక్కట్లు పడినా, ఎన్ని కష్టాలు పడినా సహిస్తూ బతుకుతుందిగాని మా గుమ్మంలోకి రాలేదమ్మా—దానికి స్వాభిమానం, పంతం చిన్నప్పటినుంచి ఎక్కువే."

"మరి మీకు దాని సంగతి, అదే, యిలా జరిగిందని మీకు ఎప్పుడు తెలిసింది?"

"అది యిల్లు వదిలాక యిలా పెళ్లిచేసుకున్నాం అని ఉత్తరంరాసి పడేసింది వారం తరువాత. అంతే! ఆ వుత్తరంచూసి మా వారు ఓ రోజంతా గదిలోవుండి కటికఉపవాసం చేసి ఎవరితో మాట్లాడలేదు—గదినుంచి వచ్చాక 'యింక అది నాకు చచ్చినదానితో సమానం. దాని పేరు గాని, దాని సంగతికాని యీ యింట్లో వినపడకూడదు' అని చెప్పేశారు ఆయన మగవారు కనుక. కన్నతల్లిని నేను లోలోపల ఎంత బాధపడ్డా ఆయనకి జడిసి నోరెత్తలేదు. సరే ఎక్కడో దానికి కావల్సినవాడితో సుఖంగా బతుకుతుందిలే అని సంతోషపడ్డాను. అదింట్లోంచి వెళ్లిన పదినెలలకి కాబోలు మా ఆడపడుచు కూతురు ఉత్తరం రాసింది—'భారతి మా వూళ్లోవుంది. ఆస్పత్రిలో పురుడు పోసుకుంది, ఆడపిల్ల—నేను ఆస్పత్రిలో పురిటికి వెళ్తే అక్కడ కన్పించింది. అతనేమయ్యాడో? అది ఒక్కర్తే దిక్కుమొక్కులేకుండా పడుంది. కళ్లల్లో ప్రాణాలు పెట్టుకుని వుంది. దాని ఆరోగ్యం అసలు బాగోలేదు. ఎంతడిగినా ఏం చెప్పలేదు ఏడవడం తప్ప. నాకీ శిక్ష కావల్సిందే అన్న ముక్కతప్ప భారతి ఏం మాట్లాడలేదు. ఇంతమంది వుండీ దిక్కులేని దానిలా ఆరో రోజున బిడ్డని ఎత్తుకుని ఆస్పత్రిలోంచి వెళ్తుంటే చూడలేకపోయాను. బలవంతంగా అడిగితే ఎడ్రసు యిచ్చింది. ఆయన వెళ్లి చూసివచ్చారు. చిన్నగదిలో పిల్లని పెట్టుకుని అతి బీదగా తినీ తినక కాలం గడుపుతూంది. అత్తా మీరు ఓసారి చూడండి. భారతి స్థితి బాగోలేదు' అని రా

## పోటీ క్విజ్-8

## ఫలితాలు

సరైన సమాధానాలు:

1.శ్రీనాథుడు 2.డెన్మార్క్ 3.కలకత్తా
4.అన్ బ్యాన్‌క్రాఫ్ట్ 5.సెయింట్ హెలీనా
6.వసంతలక్ష్మి 7.కావలూర్

సరైన సమాధానం రాసిన వారు 11 మంది. లాటరీ పద్ధతిలో విజేతలుగా ఎన్నికైన వారు

1. భాగ్యనగర్ సుశీలాదేవి, కరీంనగర్
2. సి.రోహిణి, చిత్తూరు
3. ఎ.మైత్రేయి, రాజమండ్రి
4. వేదుల శాంతిలత, అనంతపురం
5. అలవర్తి హైమవతి, నంది వెలుగు

బహుమతి మొత్తం రూ 75 లు వీరికి సమానంగా పంచి అందజేస్తున్నాము.

తక్కినవారు: వై.అంజమ్మ, నిజామాబాదు; కొత్త లక్ష్మీ తులసి, కంచర్ల పాలెం; నీరజ వేమూరి అనకాపల్లి; ఎ.టి.గాయత్రీదేవి, అనంతపురం; జి.లక్ష్మి, కల్యాణిఖని; బి.పద్మామోహన్, గుత్తి.

సింది. ఆ వుత్తరం చూసి విలవిల్లాడిపోయాను. ఆయన ఉత్తరం చదివి శిలలా వుండిపోయారు. నేను ఆయనతో దెబ్బలాడి, ఏడ్చి, ఆయన వారిస్తున్నా మాటవినను అని మొండికేసి బయలుదేరి వెళ్లాను. అక్కడ దాని దైన్య స్థితి చూసి నాగుండెలు తరుక్కుపోయాయి. పదిహేను రోజుల తొలిచూలు పురటాలు—ఉదయం వండుకున్న ఎండుమెతుకులు వచ్చడితో మింగుతోంది. చంటిపిల్లకి వరవడానికి పాత గుడ్డలు కూడా కరువయిన దాని దీనస్థితికి గుండెలవిసిపోయేలా ఏడ్చాను. యిద్దరం ఒకరిని ఒకరు వాటేసుకుని ఏడ్చాం. అడగ్గా అడగ్గా అది ఒక్కొక్క విషయం చెప్పింది అతికష్టంమీద. యిద్దరూ పారిపోయి సింహాచలం వెళ్లి పెళ్లిచేసుకుని తరువాత హైదరాబాదు వెళ్లారట. చవకరకం లాడ్జింగులో రూము తీసుకున్నారట. యిద్దరూ ఓ రెండునెలలు శుభ్రంగా తిని తిరిగారు. ఈ లోగా అతను ఏవేవో ఉద్యోగ ప్రయత్నాలు చేశాడట. నెల నెలగడుస్తూంటే చేతిలో డబ్బు, నగలు అయిపోతున్నా ఉద్యోగం దొరకలేదు. నాల్గునెలలకి అతనికి దొరకలేదుకాని దీనికి ఏదో చిన్న ప్రయివేటు స్కూల్లో టీచరుగా రెండువందల యాభైకి ఉద్యోగం దొరికిందట. అప్పటికే దీనికి మూడోనెల. ఆయనగారికి చేతిలో డబ్బు లేకపోవడం, ఉద్యోగం దొరక్కపోవడంతో విసుగులు, చిరాకులు, కసుర్లు దెబ్బలాటలు ఆరంభమయ్యాయి. ఊరంతా బలాదూరు తిరిగి రాత్రి భోజనానికి వచ్చేవాడట. దీనిమీద మోజుతగ్గిపోగానే... "ఛా... నీవల్లే నాకీ కష్టాలు, లేకపోతే హాయిగా యీపాటికి ఏ ఎమ్మెస్సీలోనే చేరి చదువుకునేవాడిని. ప్రేమ అనుకుని గోతిలోకి దిగాను" అంటూ సాధించి తిట్టిపోసేవాడట. ఆరునెలలకి ఏదో ఆఫీసులో గుమస్తా ఉద్యోగం దొరికిందట. అప్పటినుంచి అసలు యింటిపట్టున వుండకుండా తెచ్చుకున్నది తింటూ తిరిగేవాడట. ఒక్కోసారి రెండు మూడు రోజులకీ వచ్చేవాడుకాదుట. అడిగితే 'నాయిష్టం నోర్మూసుకో' అనేవాడట. యింకా నిలేస్తే 'నువ్వేం నాపెళ్లానివా అడగడానికి' అన్నాడట. యిది నిర్ఘాంతపోయి 'నీ భార్యను కానా?'అంటే 'ఏదీ సాక్ష్యం చూపించు. ఆ దేముడు వచ్చి సాక్ష్యం చెపుతాడా' అని వికటంగా నవ్వేవాడట. ఆ తరువాత ఎన్నోసార్లు వాళ్ల ఆఫీసులో టైపిస్టుతో తిరుగుతూ కన్పించాడట. అదేం అంటే 'నాయిష్టం నీదిక్కున్నచోట చెప్పుకో' అనికొట్టేవాడట. ఆఖరికి ఎనిమిదినెలలకి, దీనికిఆరునెలలప్పుడు యిది స్కూలుకి వెళ్లగా చూసి, యింట్లోంచి తన పెట్టెబేడా పట్టుకుపోయాడుట.

"రాస్కెల్, ఎంత పనిచేశాడు, యిది ఎలా వూరుకుంది, పోలీసులకి రిపోర్టు యివ్వాల్సింది."

'ఏమనిస్తుంది—వాడు దీని భర్త అనడానికి సాక్ష్యం ఏముంది? అప్పటికే ఆరునెలలు. అబార్షన్ చేయించుకుందామన్నా కుదరక చచ్చినట్టు వాడి పాపాన్ని మోసి కనింది. అప్పటివరకు అది పడ్డపాట్లు వింటే కసాయి గుండెన్నా చెదిరి పోతుంది. రెండువందల ఏభైలో ఎనభైరూపాయలు గది అద్దెపోగా, మిగిలిన దాంతో ఒక పూటతిని ఒక పూట తినక, నీరసంతో, తొమ్మిదోనెల వచ్చేవరకు ఉద్యోగంచేసింది. పురుడు అదీ అయి వచ్చేవరకు ఖాళీగా వుంచం అని వాళ్లు యింకో టీచరుని వేసుకున్నారుట. ఈ నెలరోజులుగా చేతిలో దమ్మిడీలేక, ధర్మాసుపత్రిలో పురుడుపోసుకుని, వాళ్లిచ్చిన బ్రెడ్‌ముక్కలు తిని ఆరు రోజులు గడిపి, యింటికి వచ్చాక అదీ లేకుండా పడివుంటే మా ఆడపడుచు కూతురు తిట్టి ఐదొందలు ఇచ్చిందట. అప్పుగా తీసుకుంటానని తీసుకుందిట. యిప్పుడు యింకో వుద్యోగం దొరికే వరకు అదే ఆధారం అమ్మా" అంది శుష్కహాసం చేస్తూ.



హరిత

**రంగప్రవేశం చేసిన వారే పదిమంది దృష్టినీ ఆకర్షించి, ప్రశంసలు అందుకోవాలనుకోవడం - నాట్యం నేర్చే ప్రతి ఒకరూ ఆశించేదే. అయితే ఆ ఆశ ఫలించేది ఏ కొందరికో. అటువంటి అరుదైన కొందరిలో ఒకరు కుమారి హరిత. అయితే ఆమె రంగప్రవేశం వెనుక ఐదేళ్ళ శిక్షణ ఉంది. హైదరాబాదులోని శంకరానంద కళాక్షేత్రలో కుమారి ఆనందాశంకర్ వద్ద నాట్య శిక్షణ పొందిన పదహారేళ్ళ హరిత—చదువులోనూ శ్రద్ధ చూపి బహుమతులు పొందుతూ ఉండడం విశేషం.**

'మేం చచ్చేమనుకున్నావే. నీకింత పంతం ఏమిటే, యిలా దిక్కులేని దానిలా పడుంటావా' అని తిట్టాను. ఏడ్చాను. వెంటనే యింటికి పదమన్నాను. అది ససేమిరా రానంది. 'ఏం మొహం పెట్టుకుని రాను. వద్దమ్మా నా తప్పుకి నేను శిక్ష అనుభవించాలి. నాతప్పు నేనెవరినెత్తినైనా రుద్ది వాళ్లకి భారం అవను. నాలాంటి ఆడపిల్లలందరూ నా కథవల్ల నీతి నేర్చుకోవాలి. మిమ్మల్ని పెట్టిన ఉసురుకి నాకీ శిక్ష తప్పదు. అనుక్షణం నా తప్పు నాకు తెలిసి వచ్చేట్టు నేనిలా నరకయాతన పడుతూనే వుండాలి. నా తప్పుకి, నా పాపానికి ఫలితంగా యీ బిడ్డని కన్నాను. అంతే. చచ్చినట్టు దీన్ని పెంచి పోషించాల్సిన బాధ్యతనాది. నా పాపం మీరూ పంచుకోవద్దు—వద్దు నన్ను వదిలిపో అమ్మా... నాన్న నా మొహం చూడడు. నేనక్కడికి వచ్చి మిగతా పిల్లల పెళ్లి పేరంటాలకి ఓ సమస్యగా అడ్డురాను' అంటూ ఎంతచెప్పినా ససేమిరా రానంది—బలవంతంగా ఓ ఐదువందలు చేతిలో పెట్టిపిల్లకి కావల్సిన బట్టలు, దుప్పట్లు, పాలడబ్బా, దానికి మందులు అవీ కొన్నాను. 'మొదటికాన్పు ఖర్చుమాది, పెళ్లయితే పురుడుపోయమా. అందుకే నేవేం మాట్లాడకూడదు' అని తిట్టాను. 'సరే, ఆడపిల్ల పెళ్లయ్యాక పుట్టింటినుంచి ఎంత వరకు ఏం పొందవచ్చో అంతకంటే ఎక్కువ నాకొద్దు—అంతకంటే ఏం యిచ్చినా పుచ్చుకోను' అంది. మా ఆడపడుచు కూతురిని మధ్య మధ్య వెళ్లి చూడమని చెప్పి గుండె రాయి చేసుకుని వచ్చాను.. యింటికి వచ్చాక జరిగింది చెపితే అంతకఠినంగా మారిపోయిన ఆయన ఆ రోజంతా తలుపులు బిగించుకుని ఏడ్చారు. తరువాత ఆయన రాసినా, నేను రాసినా అది రాలేదు. ఆఖరికి ఆయనకి తెలిసిన ఫ్రెండుద్వారా, బి.హెచ్.యి.ఎల్ గర్ల్సు స్కూల్లో ఆరువందల ఏభైరూపాయల ఉద్యోగం యిప్పించారు. కాస్త దానికోబతుకు తెరువు ఏర్పడిందని సంతృప్తి పడడంకంటే యింకే చెయ్యమమ్మా? యిప్పుడు పుట్టింటినించి నేను పంపే పచ్చళ్లు అవీ వద్దనదు. పండక్కి రమ్మని ఆయన రాస్తే ఏడాదికి ఒకసారి రెండుసార్లు వచ్చి నాల్గురోజులుండి వెడుతుంది. చీరయిస్తే పుచ్చుకుంటుంది. అంతకు మించి దమ్మిడీ పుచ్చుకోదు. అలా ఒంటరిగా ఆపిల్లతో ఉద్యోగంచేసుకుంటూ బతుకీడుస్తూంది."

"మళ్లీ అతని కబురు తెలియలేదా, అలా వదిలేయడమేనా ఆ రాస్కెల్‌ని"

"ఆయనా నేనూ అదే అంటాం. వాడిపేరెత్తడానికి వీలుకాదంటుంది. వాడినీడ కూడా నామీద నా కూతురి మీద పడకూడదంటుంది. మరి జన్మలో మగవాడి అండదండలు కోరను. పది జన్మలకీ మగవాళ్లని నమ్మను అంటుంది కసిగా. అయిందేదో అయింది. ఈ రోజుల్లో రెండోపెళ్లి తప్పుకాదు. పిల్లని నేను చూసుకుంటాను. కాస్తోకూస్తో డబ్బుపారేసి ఎవరికన్నా యిచ్చి పెళ్ళిచేద్దాం అన్నా అది అసలు వింటుందా? ఉరిమి చూస్తుంది. 'పెళ్లి... ఇంకా మగవాడ్ని నమ్ముతానా' అంటుందిహేళనగా. దానికసి అంతా దానిమీదేచూపించుకుంటూ, దాన్ని అదే శిక్షించుకుంటూ అష్టకష్టాలు పడుతూ బతుకుతోంది."

భానుమతి కళ్ళు తుడుచుకుంది. సునయన మనసు వికలమయిపోయింది. ఎలాంటి భారతికి ఎలాంటి దుర్గతి! భారతిలాంటి దురదృష్టవంతుల కథలు మరింతమంది భారతుల్ని అలాంటి దుర్గతినించి కాపాడగలిగితే ఆమె ఆశయం నెరవేరుతుంది! కాని అది జరిగేదా? 'ప్రేమలో పడకండి అమ్మాయిలూ జాగ్రత్త' అంటే చెప్పిన వాళ్లని చూసి హేళనగా నవ్వుకుంటారు—తప్పటడుగు వేస్తారు—ఊబిలో కూరుకుపోతారు—ఎలా వీళ్లని రక్షించడం!

దారిపొడుగునా సునయన అలా ఆలోచిస్తూనేవుంది!□